క్లుప్తంగా

రోటరీ క్లబ్ సభ్యుల సేవలు అభినందనీయం



శావల్యాపురం: రోటరీ క్లబ్ సభ్యుల సేవలు అభినందనీయమని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సింగంశెట్టి అన్నపూర్ణమ్మ అన్నారు. గురువారం మండలంలోని పొట్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడా విద్యార్థులకు 30 జతల స్పోర్ట్స్ డ్రస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్రాంత ఉపాధ్యాయులు, రోటరీ క్లబ్ సభ్యులైనా గాండ్ల నాగేంద్రుడు సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ఆటలు పోటీల్లో పాల్గొని మండలానికి మంచిపేరు తేవాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు ఆలా శ్రీనివాసరావు, చిరుమామిళ్ళ కోటేశ్వరరావు, ముత్తినేని గిరిబాబు, కూచి రామాంజినేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు బత్తుల అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాదెండ్ల ఎంపీడీవోగా స్వరూపరాణి



నాదెండ్ల: ఎంపీడీవోగా ఎస్.స్వరూపరాణి డిప్యుటేషన్‌పై నాదెండ్లకు వచ్చారు. గురువారం ఆమె విధుల్లో చేరారు. గత నెల 19న పదోన్నతిపై ఆమె రెంటచింతలకు బదిలీ అయిన విషయం తెలిసిందే. అయితే అక్కడ పనిచేస్తున్న చిలుకూరి శ్రీనివాసరావు నాదెండ్లకు బదిలీపై వచ్చారు. ఇరువురి ఉమ్మడి అంగీకారంతో డిప్యుటేషన్‌పై స్వరూపరాణి నాదెండ్లకు, శ్రీనివాసరావు రెంటచింతలకు వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన స్వరూపరాణికి పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అత్యాచారయత్నంపై కేసు నమోదు



యడ్లపాడు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అత్యాచార యత్నంపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కారుచోల గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగిని క్షేత్రస్థాయి విధుల్లో ఉండగా గ్రామానికి చెందిన జాజుల పెదతిరుపతయ్య అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె కేకలు వేసింది. దీంతో సమీపాన ఉన్న మహిళలు వచ్చి అతన్ని మందలించి పంపించేశారు. యువతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.శివరామకృష్ణ తెలిపారు.

నిందితుడి అరెస్టు

అత్యాచారయత్నం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి విలేకర్ల సమావేశం నిర్వహించారు. మండలంలోని కారుచోల గ్రామ సచివాలయ ఉద్యోగినిపై అత్యాచార యత్నానికి పాల్పడ్డ అదే గ్రామానికి చెందిన జాజుల పెదతిరుపతయ్యను అదుపులోకి తీసుకున్నామని చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు తెలిపారు. ఎస్సై టి.శివరామకృష్ణతో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయా వివరాలను వెల్లడించారు.

ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్స్‌కు సన్మానం



నరసరావుపేట రూరల్: ఆల్ ఇండియా థాల్ సైనిక్ క్యాంప్‌లో ప్రతిభ కనబర్చిన ఎన్‌సీసీ క్యాడెట్ల సన్మాన కార్యక్రమం బుధవారం నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు, మేజర్ అంజిరెడ్డి, మేజర్ బీఎస్‌ఆర్‌కే రాజు, సుబేదార్ బల్విందర్ సింగ్, హవల్దార్ శంషార్‌సింగ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూనియర్ అండర్ ఆఫీసర్ సీహెచ్ మణికుమార్, పి.లిఖితనందినిలను సన్మానించారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ ఏటీఎస్‌ఎస్ అనుభవాలను, సాధించిన విజయాలు వెనుక ఉన్న కృషిని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకోవాలి

నరసరావుపేట రూరల్: ములకలూరు గ్రామ పరిధిలో ఆక్రమణలో ఉన్న వాగు పోరంబోకు భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని భూమి లేని నిరుపేద కుటుంబాలకు ఇవ్వాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్యమాదిగ, మాల మహానాడు నాయకుడు మద్దాల రమేష్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామంలో 4 ఎకరాల వాగు పోరంబోకు భూమిని కొంత కాలంగా మైనార్టీ వర్గానికి చెందిన భూస్వామి సాగు చేస్తున్నాడని, ఈ భూమిని నిరుపేదలకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను వినతిపత్రం ద్వారా కోరగా, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు నిరుపేదలైన ఎస్సీలకు ఇస్తామని చెప్పి, మైనార్టీ వర్గానికి చెందిన భూస్వామికి వత్తాసు పలుకుతున్నారని పేర్కొన్నారు. వాగు పోరంబోకు భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో 48 కోట్ల బాటిళ్ల నారా వారి మద్యం అమ్మకాలు

- రాష్ట్రంలో 70 వేల బెల్టు షాపులు నడుపుతున్న కూటమి ప్రభుత్వం
- రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలపర్తిని అభినందించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



డాక్టర్ గోపిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేసిన పాలపర్తి, నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో 70 వేల బెల్ట్ షాపుల ద్వారా 48 కోట్ల బాటిళ్ల నారా వారి కల్తీ మద్యం పంపిణీ చేస్తున్నారని, ప్రజలకు మంచినీళ్ళు ఇవ్వక పోయినా మద్యం మాత్రం ఏరులై పారిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితుడైన పాలపర్తి వెంకటేశ్వర్లు తన నియామకానికి సహకరించిన డాక్టర్ గోపిరెడ్డిని కలిసి దుశ్శాలువ, పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ఎక్కడ చూసినా కల్తీ మద్యం విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, నియోజకవర్గంలో 110 మంది కల్తీ మద్యాన్ని విక్రయిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, రాష్ట్రంలో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నా.. సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్ అయినా, సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్ అని ఫేక్ పబ్లిసిటీ చేసుకుంటూ ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారన్నారు. జీఎస్టీ కేంద్ర ప్రభుత్వం తగ్గిస్తే మేమే తగ్గించామన్నట్లు సంబరాలు చేసుకోవడం ఈ ప్రభుత్వానికే చెల్లిందని అన్నారు. మున్సిపల్ ఆస్తి, కుళాయి పన్నులను ఇష్టం వచ్చినట్టు పెంచారని, ఆరోగ్యశ్రీని అటకెక్కించారని అన్నారు. ఈ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు మేలు చేసే ప్రభుత్వమని, ఇప్పటికైనా పేదలకు మేలు చేసే కార్యక్రమాలు అమలు చేయాలని కోరారు.

+ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో పాలపర్తికి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పదవి రావడం చాలా సంతోషమని అన్నారు. కౌన్సిలర్‌గా వార్డులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్థాయి నుంచి రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ స్థాయికి ఎదిగాడని, రాబోయే రోజుల్లో అందరినీ కలుపుకొని వచ్చే ఎన్నికల్లో పార్టీ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలని కోరారు. పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో పార్టీ జెండా ఎగురవేసి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపు ఇచ్చారు. ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఇఎం స్వామి, మున్సిపల్ విభాగ జిల్లా అధ్యక్షుడు షేక్ రెహమాన్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ మాగులూరి రమణారెడ్డి, మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, నరసరావుపేట మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ జిల్లా, పట్టణ కార్యదర్శులు కార్యదర్శి కందుల ఎజ్రా, పొలయ్య, పట్టణ వర్కింగ్ అధ్యక్షులు అచ్చి శివకోటి, నిడమానూరి సురేంద్ర, పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, లీగల్ సెల్ అధికార ప్రతినిధి రాపోలు శ్రీనివాసరావు, విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శి ఉప్పుతోళ్ల వేణుమాధవ్, జిల్లా అధ్యక్షుడు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు మద్రిపూడి రాంబాబు, సీనియర్ నాయకులు జి.అచ్యుతరావు, యన్నం రాధాకృష్ణారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

10 కేజీల ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం.. రూ.2,500 జరిమానా



ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

నరసరావుపేట: పట్టణంలో పర్యావరణాన్ని కాపాడటంలో అందరూ బాధ్యత వహించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు కోరారు. గురువారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది పల్నాడు రోడ్డు, మల్లమ్మ సెంటర్, కూరగాయల మార్కెట్ సెంటర్లలో ప్లాస్టిక్‌పై వ్యాపారులకు అవగాహన కల్పించారు. కిరాణా షాపులు, జ్యూస్ పాయింట్లు, తోపుడు బండ్లు, పండ్ల దుకాణాలను తనిఖీ చేశారు. పర్యావరణానికి హానికరంగా పరిణమించిన 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందం గల 10 కేజీల ప్లాస్టిక్ వస్తువులు, గ్లాసులు, కవర్లు స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారులకు రూ.2,500 వరకు జరిమానా విధించి ఆ సొమ్మును మున్సిపల్ ఖాతాకు జమచేశారు. స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ వస్తువులను జిందాల్ విద్యుత్ ప్లాంట్‌కు పంపిస్తామన్నారు. ఇక నుంచి ప్రతి రోజూ ఆకస్మికంగా పట్టణంలో పలుచోట్ల రైడింగ్ నిర్వహిస్తామన్నారు. వ్యాపారులు వినియోగదారులను పర్యావరణ హితమైన వస్తువులను వాడే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. పట్టణ ప్రజలు స్వచ్ఛ నరసరావుపేటకు సహకరించాలని కోరారు.

20 నిమిషాల్లో చైన్ స్నాచర్స్ అరెస్ట్



బాధితురాలికి బంగారు గొలుసును అప్పగిస్తున్న ఎస్సై కిషోర్

నరసరావుపేట రూరల్: పోలీసులు సకాలంలో స్పందించడంతో చోరీకి గురైన బంగారం 20 నిమిషాల వ్యవధిలోనే బాధితురాలికి అందింది. ఈ ఘటనలో ఇద్దరు చైన్ స్నాచర్స్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. ఇస్సపాలెం గ్రామానికి చెందిన ఎ.సులోచనమ్మ గురువారం మెయిన్‌రోడ్డులో ఆటో దిగి ఇంటికి వెళ్తుండగా ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వచ్చి మెడలోని బంగారు గొలుసును దోచుకెళ్లారు. సులోచనమ్మ కేకలు వేయడంతో యువకులు పరారయ్యారు. బాధితురాలు వెంటనే 100కు ఫోన్ చేయడంతో రూరల్ ఎస్సై కిషోర్ స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి విచారణ చేపట్టారు. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలికి పోలీసు స్టేషన్‌లో గొలుసును అందజేశారు. ట్రైనీ ఎస్సై వలి, సిబ్బంది పాల్గొన్నారు.

నల్ల బర్లీ పొగాకు సాగు నిషేధం



మాట్లాడుతున్న ఏవో శివలలిత

నాదెండ్ల: రాష్ట్రంలో నల్ల బర్లీ పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించినందున రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌కే సల్మాన్ చెప్పారు. నాదెండ్లలో నల్ల బర్లీ పొగాకు సాగు నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శనగ, కంది, పెసర, మినుము తదితర పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఏవో శ్రీలత మాట్లాడుతూ, నల్ల బర్లీ పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించిందని, కంపెనీల అంగీకారం పొందిన రైతులు తెల్ల బర్లీ పొగాకు సాగు చేసుకోవచ్చన్నారు. రైతులు, నర్సరీల నిర్వాహకులు నల్ల బర్లీ పొగాకు సాగు చేసినట్లయితే మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు ధ్వంసం చేస్తారని చెప్పారు. సొసైటీ చైర్మన్ నల్లమోతు హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నల్ల బర్లీ పొగాకు సాగు నిషేధంపై రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ బి.నిర్మల అధ్యక్షత వహించగా ఏవో శివలలిత మాట్లాడుతూ నల్ల బర్లీ పొగాకును రైతులు సాగు చేయవద్దన్నారు. తెల్ల బర్లీ పొగాకు సాగు కూడా కంపెనీల నుంచి అగ్రిమెంట్‌లు తీసుకుని సాగు చేయాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ ప్రసాద్‌నాయక్ పొగాకు వల్ల నష్టాలను వివరించారు. ఏఎస్ఐ కిశోర్‌కుమార్, వీఏఏలు పాల్గొన్నారు.

పేదల జీవన ప్రమాణాల మెరుగే పీ-4 లక్ష్యం



మాట్లాడుతున్న పీడీ సిద్ధ లింగమూర్తి

నూజెండ్ల: అసమానతలు లేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా చేపట్టిన పీ-4 సర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, పీడీ సిద్ధ లింగమూర్తి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పీ-4 సర్వేపై సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో చేపడుతున్న పీ-4 సర్వే పూర్తి పారదర్శకతతో చేపట్టాలన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు అర్హుల తుది జాబితా సిద్ధం చేసి అధికారులకు సమర్పించాల్సి ఉందన్నారు. ఓఎస్‌డీ సుబ్బారావు, ఎంపీడీవో ఉమాదేవి పాల్గొన్నారు.

శావల్యాపురం: పీ-4 సర్వే పారదర్శకంగా చేయాలని జిల్లా ఉపాధి పీడీ సిద్ధ లింగమూర్తి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ-4 సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 1,632 కుటుంబాలను సర్వే చేయగా 778 కుటుంబాలను అర్హులుగా గుర్తించామని, ఇప్పటికే గ్రామ సచివాలయాల వారీగా జాబితాలను ప్రచురించామని, పేర్లు లేని అర్హులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీడీవో సీతారామయ్య, నియోజకవర్గ ప్రత్యేకాధికారి వరద సుబ్బారావు, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ యాకోబు ఉన్నారు.

నేటి నుంచి డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల మండల జట్టుతో నిర్వాహకులు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం కృష్ణానాయక్, పీఈటీలు



మండల స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నరసరావుపేట రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ డివిజన్ స్థాయి ఆటల పోటీలు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్టు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. మండల స్థాయి పోటీలు గురువారంతో ముగిసినట్టు తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో మండల జట్లను ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. చెస్, యోగా పోటీలు శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో, బ్యాడ్మింటన్ పోటీలు సత్తెనపల్లిరోడ్డులోని స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. అండర్-14 బాలుర, బాలికల డివిజన్ స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు శంకరభారతీపురం హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్టు వివరించారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు క్రీడాప్రాంగణం వద్ద హాజరుకావాలని తెలిపారు.

స్కూల్ గేమ్స్‌లో ఉప్పలపాడు క్రీడాకారుల ప్రతిభ

నరసరావుపేట రూరల్: స్కూల్‌గేమ్స్ పోటీలలో ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సుందర్‌రావు గురువారం తెలిపారు. మండల స్థాయి వాలీబాల్ పోటీలలో ఐదుగురు విద్యార్థులు డివిజన్ జట్టుకు ఎంపికైనట్టు తెలిపారు. అలాగే షాట్‌పుట్‌లో జె.చందు ప్రథమ బహుమతి, జావలిన్ త్రోలో తృతీయ బహుమతి సాధించినట్టు వివరించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ముగిసిన మండల స్థాయి ఆటల పోటీలు

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి ఆటల పోటీలు గురువారంతో ముగిశాయి. రెండవ రోజు అండర్-14, 17 విభాగాలలో బాలబాలికలకు వేర్వేరుగా రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో, ట్రిపుల్ జంప్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రధానోపాధ్యాయులు సుభానీ పర్యవేక్షించారు. పోటీల్లో గెలుపొందిన వారిని డివిజన్ స్థాయిలో జరిగే ఆటల పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. ఈ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు సైదయ్య, పుల్లయ్య, నరసింహారెడ్డి, రమాదేవి తదితరులు నిర్వహించారు.

స్కూల్‌గేమ్స్‌లో గణపవరం విద్యార్థుల ప్రతిభ

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. అండర్-19 విభాగంలో రగ్బీలో దివ్యతేజ, వీక్షణ, గోపాలకృష్ణంరాజు, బ్యాడ్మింటన్‌లో గాయత్రి, మేరిగ్రేస్, జ్యోత్స్న, అక్షయ, సంతోష్‌కుమార్, బాస్కెట్‌బాల్‌లో శ్రీవల్లి, వంశీ, నెట్‌బాల్‌లో రాహుల్, కరాటేలో వెంకటకార్తీక్, ఎస్తేరు రాణి ఎంపికయ్యారు. ఈ నెల 7న అచ్చంపేట, సత్తెనపల్లి, చిలకలూరిపేట ఏఎంజీలో జరిగిన పోటీల్లో సత్తా చాటారు. హెచ్‌ఎం కృష్ణానాయక్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు రాణించి పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో పీఈటీ ఖాదర్‌మస్తాన్, ఎంవీ సుబ్బారావు, ఎస్‌కే మొహమ్మద్ ఇస్మాయిల్ ఉన్నారు.

స్కూల్ గేమ్స్‌లో జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యార్థుల ప్రతిభ

వినుకొండ: స్థానిక నరసరావుపేట రోడ్డులోని ఎస్‌ఎస్‌పీ జడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ, యోగ, షటిల్ బ్యాడ్మింటన్ విభాగాల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి మండల స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ, క్రీడలలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని, క్రీడాకారులలో క్రీడాస్ఫూర్తి ముఖ్యమని అన్నారు. అనంతరం, మండల స్థాయికి ఎన్నికైన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏటీపీ యోగయ్య, పీఈటీ జోనా నాయక్ తో పాటు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆటల పోటీల్లో క్రీడాకారుడు



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

రాష్ట్ర స్థాయి పోటీలకు వాగ్దేవి విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు గురువారం తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తాడికొండ, సత్తెనపల్లిలో నిర్వహించిన అండర్-19 బాలబాలికల కబడ్డీ, బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి జట్టు ఎంపిక పోటీల్లో తమ విద్యార్థులు డి.త్రినాథ్, ఎస్.రమణయ్య, కె.లక్ష్మీసరిత, కె.అనూహ్య (కబడ్డీ), షేక్.మహ్మద్‌నిస్సార్ (బాడ్మింటన్)లు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన విద్యార్థులు నవంబర్‌లో వినుకొండలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్ర ప్రసాదు, పాశం కృష్ణారావు, పి.వి.అచ్యుతరావు, వ్యాయామ అధ్యాపకుడు రాయల ఆంజనేయులు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల వారికి మేలు

యడ్లపాడు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'జీఎస్టీ 2.0 సంస్కరణలు' పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడనున్నాయని వైద్య బృందం తెలిపింది. మండలంలోని ప్రాథమిక వైద్యశాలలో గురువారం నిర్వహించిన 'సూపర్ జీఎస్టీ–ఆరోగ్య జీవితం కోసం సూపర్ ఆదా' కార్యక్రమంలో వారు మాట్లాడారు. సాధారణ మందుల ధరలతో పాటు ప్రాణాంతక వ్యాధులైన క్యాన్సర్, సుగర్, గుండె సమస్యల మందుల ధరలు గణనీయంగా తగ్గాయని, అలాగే అరుదైన వ్యాధులు, అవయవ మార్పిడి ఔషధాలపై పన్ను మినహాయింపు, ఆరోగ్య, జీవిత బీమాలపై జీఎస్టీ పూర్తిగా తగ్గింపు చేసినట్లు వెల్లడించారు. మొత్తం 431 వస్తువులపై జీఎస్టీ తగ్గింపు, మినహాయింపుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. అలాగే నిత్యవసర వస్తువుల ధరలు, ఆరోగ్య రంగానికి సంబంధించిన మందులు, ఇన్సూరెన్స్ ప్రీమియం, పాత ధరలకే ఎక్కడైనా విక్రయించినా, అదనపు వసూళ్లు చేపట్టినా ప్రజలు అధికారులకు వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య బృందం, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

బోధనేతర పనులు నిర్వహించేది లేదు



చిలకలూరిపేట: బోధనేతర పనులు నిర్వహించేది లేదని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నాయకులు తెలిపారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈ నెల 7న నిర్వహించిన ధర్నాలో తీర్మానించిన మేరకు గురువారం ఎంఈవో వీవీఎస్ రత్నకళను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, అన్ని రకాల యాప్‌లను రద్దు చేసి, పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. ముల్యాంకనం పుస్తకాలను రద్దు చేయాలని, గూగుల్ షీట్స్ నింపడం, విద్యాశక్తి, జీఎస్టీ ప్రచారాలు వంటి బోధనేతర పనులను ఉపాధ్యాయులపై రుద్దడం అన్యాయమని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు పోటు శ్రీనివాసరావు, మేకల కోటేశ్వరరావు, వి.జయప్రకాశ్, షేక్ మస్తాన్‌వలి, వి.రమణా నాయక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దృష్టి దినోత్సవ అవగాహన ర్యాలీ

నరసరావుపేట: ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం డాక్టర్ రామలింగారెడ్డి మాక్సీవిజన్ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్లు, సిబ్బంది పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గుంటూరు రోడ్డు నుంచి ప్రారంభమై మాహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్, మల్లమ్మసెంటర్, గడియారం స్తంభం సెంటర్, డాక్టర్ గోపిరెడ్డి హాస్పిటల్ మీదుగా డాక్టర్ రామలింగారెడ్డి హాస్పిటల్‌కు చేరింది. ర్యాలీలో డాక్టర్ ఏఏవీ రామలింగారెడ్డి, డాక్టర్ చెంచురెడ్డి, డాక్టర్ శాంతిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభం

రొంపిచర్ల: మండలంలోని అన్నవరప్పాడు గ్రామంలో హరిహర క్షేత్రంలో విగ్రహ ప్రతిష్టామహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ మందిరంలో వినాయక, వేంకటేశ్వర, పరమేశ్వర, నందీశ్వర, గరుత్మంత విగ్రహాలను శనివారం ప్రతిష్టించనున్నారు. ప్రతిష్టా కార్యక్రమంలో భాగంగా గురువారం గణపతి పూజ, పుణ్యాహవాచన, దీక్షధారణ, పంచగవ్య ఉపాశన, అఖండ స్థాపన, మండపారాధన, అగ్నిప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం విగ్రహాలకు ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవం, మండప పూజ, హోమాలు, ధాన్యాధివాసం నిర్వహిస్తారు. శనివారం ఉదయం అర్చనలు, హోమాల అనంతరం విగ్రహ ప్రతిష్ట నిర్వహించి పూర్ణాహుతి, స్వామి వారి అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు భక్త బృందం తెలిపింది.

సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా

నరసరావుపేట టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ లోకనాథం తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సరైన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటివి లేని వాహనాలు రోడ్లపైకి తీసుకురావద్దని సీఐ కోరారు. వాహనదారులు విధిగా పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ నిబంధలను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు వేణు, రాజా, ఏఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలు

బొల్లాపల్లి: మండలంలో సామాజిక తనిఖీలు ముగిసాయి. 17వ విడత సామాజిక తనిఖీలలో 33 గ్రామ పంచాయతీల్లోని పనుల తనిఖీ చేపట్టి గ్రామ సభలు నిర్వహించిన అనంతరం మండల కేంద్రంలో ప్రజావేదికతో ముగించారు. 33 పంచాయతీల్లో 841 పనులకు రూ.15.76 కోట్ల నిధులు వెచ్చించారు. 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికలో రూ.2.46 కోట్ల మేర నిధుల దుర్వినియోగం, అక్రమాలు ఉన్నట్లు గుర్తించారు. ఏపీవో ఎం.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజా వేదికలో రూ.3.05 లక్షలు రికవరీ, రూ.29 వేలు పెనాల్టీ, రూ.88.14 లక్షల పనులను విచారణ నిమిత్తం, రూ.37.43 లక్షల పనులను తిరిగి 15 రోజుల్లోగా పూర్తి చేయాలని లేకుంటే రికవరీ ఉంటుందని పీడీ ఆదేశించారని తెలిపారు. 17వ విడత సామాజిక తనిఖీలు నిజాలు నిగ్గు తేల్చడంలో విఫలమయ్యాయని, కొండను తవ్వి, ఎలుకను పట్టిన చందంగా ఉన్నాయని, అక్రమాలు భారీగా వెలుగు చూసినప్పటికీ ప్రజావేదికలో బహిర్గతం కాలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గమైన ఆలోచన

చిలకలూరిపేట: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గమైన ఆలోచన అని అంబేడ్కర్ జ్ఞాన సొసైటీ అధ్యక్షుడు మైలా చిన్న నాగేశ్వరరావు విమర్శించారు. పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటుకు అప్పగించటం వలన ప్రతిభ గల పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులతో నిర్మించిన, నిర్మాణంలో ఉన్న కళాశాలలను అప్పనంగా ప్రైవేటుకు అప్పగించటం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని విమర్శించారు. మెడికల్ కళాశాలలు ప్రభుత్వమే నడిపించాలని డిమాండ్ చేశారు. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై మతోన్మాద శక్తులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కళాకారుల సంఘం అధ్యక్షుడు సీకే బాబు, అంబేడ్కర్ లిబరేషన్ పార్టీ నాయకుడు వెయ్యల ఏసురత్నం పాల్గొన్నారు.

మ్యాక్స్‌కేర్ తిరుమలలో సాలిడ్ స్టేట్ మోనోమీటర్

నరసరావుపేట: మ్యాక్స్‌కేర్ సాయి తిరుమల సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్‌లో జిల్లాలోనే ప్రథమంగా అనేక రకాలైన వ్యాధులను గుర్తించేందుకు సాలిడ్ స్టేట్ మోనోమీటర్ పరీక్ష పరికరాన్ని ఏర్పాటు చేసినట్లు హాస్పిటల్ ఎండీ డాక్టర్ యనమదల శివప్రదీప్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ స్పెషలిస్టు డాక్టర్ మన్నె గౌతమ్ పేర్కొన్నారు. గురువారం వారు మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం ఈ పరికరం ద్వారా ముటిలిటీ డిజార్డర్‌లో అకిలేసియా కార్డియా, యాసిడ్ రిఫ్లెక్షస్ పరీక్షలు చేయటం జరుగుతుందన్నారు. దీర్ఘకాలంగా మింగుడు పడటంలో ఇబ్బంది, తిన్న ఆహారం గొంతులోనే ఉన్నట్లుగా అనిపించడం, తిన్న వెంటనే వాంతి అవడం, అలాగే గుండె పట్టేసినట్లు, గుండెలో మంటగా ఉన్న వారికి ఈసోఫెగస్ మోనోమీటర్ ద్వారా జబ్బును నిర్ధారించి తగిన వైద్యం చేయబడుతుందన్నారు. దీర్ఘకాలికంగా మలబద్ధకం ఉన్న వారికి రెక్టల్ మోనోమీటర్ ద్వారా నిర్ధారణ, చికిత్స అందించబడుతుందన్నారు.

సాగర్ బాబు దీక్షకు మద్దతుగా ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

రొంపిచర్ల: దళిత యువకుడు సాగర్ బాబు చేస్తున్న నిరాహార దీక్షకు మద్దతుగా గురువారం ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోట నాయక్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. కోట నాయక్ మాట్లాడుతూ కారంపూడి మండలం పెదకొదమగుండ్ల గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు ఏఈ కోటేశ్వరరావు, ఎల్ఐ ఓంకార్, ఎల్ఎం వెంకటేశ్వర్లు, లైన్‌మెన్ పరబ్రహ్మాచారి, విద్యుత్ నిలుపుదల చేయకుండానే స్తంభం ఎక్కించి సాగర్‌బాబును వికలాంగుడిగా మార్చారన్నారు. దీనిపై తప్పుడు రిపోర్ట్ ఇచ్చిన ఆ శాఖ అధికారులపై చర్యలు తీసుకుని, సాగర్ బాబుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, కేవీ ప్రసాద్, సీఐటీయూ నాయకులు సరికొండ వెంకటేశ్వరరాజు, పౌరహక్కుల సంఘం నాయకులు మరియబాబు పాల్గొన్నారు.